# ప్రజావాణికి 65 అర్జీలు


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 23: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 65 అర్జీలు వచ్చాయని, వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, ఏవో పరమేశ్ పాల్గొన్నారు. అనంతరం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో పంట రుణమాఫీలో లబ్ధిపొందిన రైతులందరికీ కొత్తరుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి బ్యాంకర్లకు సూచించారు.

## నిబంధనల ప్రకారమే వసూలు చేయాలి


కంది పంచాయతీలో తైబజార్ వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కంది, సెప్టెంబర్ 23: నిబంధనల ప్రకారమే తైబజార్ వసూలు చేయాలని ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. సోమవారం కంది గ్రామ పంచాయతీలో కంది తైబజార్ వేలంపాట నిర్వహించారు. ప్రభుత్వ పాటగా రూ. లక్షా యాభై ఎనిమిది వేల ధర నిర్ణయించి వేలంపాట ప్రారంభించారు. పాటలో స్థానికులు చాల మంది పాల్గొన్నప్పటికీ మహ్మద్ చాంద్‌పాషా రూ.3.50 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఎంపీడీఓ మాట్లాడుతూ పాత నిబంధనల ప్రకారమే తైబజార్ వసూలు చేయాలని, ఇందులో ఎవ్వరినీ ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. ఈ వేలం ఆరు నెలల తర్వాత మార్చి 2025 వరకు సమయ కాలం ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యాదర్‌గౌడ్, సిబ్బంది మల్లేశం పాల్గొన్నారు.

## బసవేశ్వర ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం


బసవేశ్వర ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సదాశివపేట, సెప్టెంబర్ 23: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బసవేశ్వర ఆలయంలో అపచార ప్రాయశ్చిత హోమం నిర్వహించారు. హిందు ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అడివయ్యస్వామి, కోశాధికారి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు అయ్యప్పస్వామి, శశిధర్‌స్వామి, బసవలింగం, నగేష్, శంభు, ప్రసాద్, ప్రవీణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి


బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

సదాశివపేట, సెప్టెంబర్ 23: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు మండల పరిధిలోని ఎంఆర్‌ఎఫ్, బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమల వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు, ఫ్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింలు, రాజు, హరికృష్ణ, నందు, సంజీవ్, శాంతకుమార్, శ్రీశైలం, నాగయ్య, రాములు, హన్మంతు, ప్రవీణ్, శ్రీనివాస్, వీరేశం, సంజీవరావు, అంజనేయులు పాల్గొన్నారు.

## విరివిగా మొక్కలు నాటుదాం


బీరప్ప బస్తీలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, సెప్టెంబర్ 23: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజా బాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపాలిటీలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో కమిషనర్ మంగతాయాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11వ వార్డు బీరప్ప బస్తీలో ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవాడలో మానవ మనుగడకు మొక్కలు నాటడం అవశ్యమన్నారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యతలు తీసుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు వృక్ష సంపదను అందించిన వారిమవుతామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛతాహీ సేవా'లో వన మహోత్సవం


డంపింగ్ యార్డు వద్ద మొక్కలు నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్, సెప్టెంబర్ 23: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డుల ప్రహరీ చుట్టూ మొక్కలు నాటారు. ప్రాసెసింగ్ ప్లాంట్‌లను శుభ్రపరిచే పనులు చేపట్టారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన అవసరం


పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రాయికోడ్, సెప్టెంబర్ 23: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన ఉండాలని అంగన్‌వాడీ టీచర్లు సక్కుబాయి, లలిత, లక్ష్మి, మంజుల, సమాధన అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్ ఐకేపీ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 30 వరకు నిర్వహిస్తున్న జాతీయ పోషణ మాసంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పిల్లల పోషణ, పోషకాహారం, పరిశుభ్రతపై వివరించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ ఐకేపీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఐకేపీ అధికారి నర్సింహులు ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా

బొల్లారం, సెప్టెంబర్ 23: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన అంగన్‌వాడీ 7వ సెంటర్‌కు దాతలు ముందుకు వచ్చి బీరువా బహూకరించారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ తులసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని స్థానిక బీజేఆర్ ఫౌండేషన్ తరపున జయమ్మ, జీతయ్య దంపతులు బీరువా, స్టీల్ ప్లేట్లను అందజేశారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

హత్నూర, సెప్టెంబర్ 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని సీడీపీవో ప్రియాంక అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హత్నూరలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

### ఉపాధ్యాయులను తిరిగి పంపండి

మునిపల్లి, సెప్టెంబర్ 23: మా ఉపాధ్యాయులను మాకు పంపించండంటూ మునిపల్లి మండలవాసులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఉపాధ్యాయులను ఇతర మండలాలకు డిప్యుటేషన్లపై పంపించడంపై 22న 'నమస్తే తెలంగాణ'లో డిప్యుటేషన్లతో ప్రభుత్వ బడుల మూత అనే శీర్షికకు ప్రజా సంఘుల నాయకులు స్పందించి సంగారెడ్డి విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎంపీ రఘునందన్‌రావు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 23: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన భూమిని సంరక్షించాలని వినతిపత్రం అందజేశారు. అమీన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మండలాధ్యక్షుడు పాండు రంగారెడ్డి, కౌన్సిలర్లు, గ్రామ పెద్దలతో ఆయన కలెక్టర్‌ను కలిసి పాఠశాల భూమికి సంబంధించి పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 2022లో ఆరున్నర ఎకరాల భూమిని పలు ప్రభుత్వ శాఖలకు కేటాయించారని, ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండెకరాలు కేటాయించినట్లు తెలిపారు. సర్వే నంబర్ 993/పిలో కేటాయించిన ఈ భూమికి సంబంధించి పోలీసులు క్లెయిమ్ చేస్తున్నారని చెప్పారు. వెంటనే పాఠశాలకు ఆ రెండెకరాలు కేటాయిస్తూ పొజిషన్ ఇప్పించేలా తహసీల్దార్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## రాజీతో కేసులను పరిష్కరించుకోవాలి

### ఎస్పీ చెన్నూరి రూపేశ్


మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 23: రాజీ మార్గమే రాజ మార్గమని, కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ మెగా లోక్ అదాలత్–సైబర్ నేరాలు, ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసానికి గురై మోసపోయిన బాధితులకు కోల్పోయిన డబ్బులను త్వరగా అందేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు వినియోగించుకొని కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనంత వరకు ఎక్కువ కేసులను రాజీ కుదిర్చాలని అధికారులకు సూచించారు. రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులను పరిష్కరించి కేసులను క్లోజ్ చేసుకోవచ్చన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బులు త్వరగా బాధితులకు అందేలా చేడాలన్నారు. రూ.25వేల కంటే తక్కువ డబ్బు కోల్పోయిన కేసుల్లో లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసుకొని, ఎఫ్‌ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియ చేసుకోవచ్చన్నారు. ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్ విషయమై స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ సంజీవరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ

జహీరాబాద్, సెప్టెంబర్ 23: బీఆర్‌ఎస్ పాలనలోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ నాయకులు మాత్రం తామే చేశామని చెప్పడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింలు, వెంకటేశం మాట్లాడారు. 2022లోనే ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.28.15 కోట్లు, పీఆర్ రోడ్లకు రూ.52 కోట్లు నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తామే అభివృద్ధి పనులను మంజూరు చేయించామని తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పాడైపోయిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. నాయకులు మచ్చేందర్, నర్సింహాగౌడ్, గో వర్ధన్‌రెడ్డి, అమీత్‌కుమార్, చిన్నారెడ్డి, రాజశేఖర్, బస్వరాజ్, ప్రభుపటేల్, ఎజాజ్‌బాబా, అనిల్, ప్రభాకర్, దత్తరెడ్డి, శంకర్, రాములు, నర్సింలు, సిద్ధన్న, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబర్ 23: మండలంలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో చేపట్టిన డంపింగ్‌యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి బీఆర్‌ఎస్ గుమ్మడిదల నాయకులు వినతి పత్రం అందజేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. పచ్చని అడవిని కలుషితం చేయొద్దని, డంపింగ్‌యార్డు ఏర్పాటుతో రైతులకు, చుట్టు గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే డంపింగ్‌యార్డు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు హన్మంత్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, చెన్నంశెట్టి సూర్యనారాయణ, బుచ్చగారి చంద్రారెడ్డి, అమ్మారి రవీందర్‌రెడ్డి, నల్తూరు యాదగిరి ఉన్నారు.

## ప్లాట్ ఓనర్లకు న్యాయం చేయాలి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 23: రూపాయి రూపాయి కూడబెట్టుకొని కొనుక్కున్న ప్లాట్‌లలోకి తమని వెళ్లనివ్వకుండా కొందరు ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకుంటున్నారని గౌతమ్‌నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్‌వీ రెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1985లో తెల్లాపూర్ మున్సిపాలిటీ ఈదులనాగులపల్లిలోని సర్వే నంబర్ 134, 135లోని లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. అందులో ఎలాంటి నిర్మాణాలు జరగకపోవడంతో కొందరు వ్యక్తులు ఆ భూములపై కన్నేసి నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై గతంలో కోర్టుని ఆశ్రయించడంతో ప్లాట్ల స్థలంలోకి ఎవరూ వెళ్లవద్దని తమకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందని, కోర్టు ఆర్డర్ మేరకు ఇండ్లు నిర్మాణం చేసుకోవడానికి మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. తమ ఇండ్లు కట్టుకుంటుంటే కొందరు ప్రైవేట్ వ్యక్తులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పూర్ణచందర్‌రావు, సాయిలు, తిరుపతిరావు, సాయికుమార్, శామ్‌కుమార్, నర్సింహరాజు తదితరులు ఉన్నారు.

### బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నారాయణఖేడ్, సెప్టెంబర్ 23: నారాయణఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల వద్ద బస్ షెల్టర్ ఏర్పాటుకు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ స్థలాన్ని పరిశీలించారు. నిత్యం కళాశాలకు రాకపోకలు సాగించే తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పట్టణానికి చెందిన వ్యాపారి తానాజీ సహకారంతో షెల్టర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, ఆర్టీసీ పీఆర్‌వో పాండు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

నిజాంపేట్, సెప్టెంబర్ 23: నిజాంపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి భార్య బాలమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భుపాల్‌రెడ్డి సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బీఆర్‌ఎస్ నారాయణఖేడ్ మండల మాజీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, నిజాంపేట్ మాజీ సర్పంచ్ జగదీశ్వరచారి, నాయకులు రాంచందర్ రావు పాటిల్, విఠల్‌రెడ్డి, మైమద్, నబి, కృష్ణ, పీరయ్య, ప్రవీణ్‌రెడ్డి, మక్బుల్ ఉన్నారు.

### మాదారం రోడ్డుకు మరమ్మతులు

జిన్నారం, సెప్టెంబర్ 23: వర్షాలకు మాదారం ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలు తేలడంతో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. గ్రామ ప్రధాన చౌరస్తా, పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పడిన భారీ గుంతలను పూడ్చి వేసి వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలిగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు గణేశ్, నరసింహగౌడ్, రామకృష్ణగౌడ్, అరేందర్‌గౌడ్, వీరేశ్, పాండు ఉన్నారు.

### ఆర్చ్ ఫార్మాలో బీఎంఎస్ విజయం

హత్నూర, సెప్టెంబర్ 23: హత్నూర మండలం గుండ్లమాచునూర్ శివారులోని ఆర్చ్ ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన కార్మికసంఘం ఎన్నికలో బీఎంఎస్ విజయం సాధించింది. పరిశ్రమలో 59మంది కార్మికులు ఓటర్లుగా ఉండగా బీఎంఎస్ అభ్యర్థి వడిగపల్లి ప్రభుకు 40 ఓట్లు, సీఐటీయూ అభ్యర్థి వడిగపల్లి శ్రీరాములుకు 18 ఓట్లు పడ్డాయి. ఒక ఓటు చెల్లలేదు. దీంతో గెలుపొందిన తమ అభ్యర్థితో పరిశ్రమ ఎదుట బీఎంఎస్ కార్మికులు సంబురాలు జరుపుకున్నారు.


పరిశ్రమ ఎదుట సంబురాలు జరుపుకొంటున్న కార్మికులు

### ప్రపంచ పరిశోధకుడిగా గీతం అధ్యాపకుడు


బప్పాదిత్య చటర్జీ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 23: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య చటర్జీని ప్రపంచంలోని అత్యుత్తమమైన పత్రాలను ప్రచురించిన రెండు శాతం పరిశోధకుల్లో ఒకరిగా స్టాన్‌ఫోర్డ్–ఎల్సీవర్(2024) గుర్తించింది. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు ఫార్మసీ, ఆరోగ్య పరిరక్షణ రంగంలో గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివకుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ గౌతమరావు, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్ దాస్, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ డాక్టర్ బప్పాదిత్యను అభినందించారు.

### కలప కోత వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలి

జహీరాబాద్, సెప్టెంబర్ 23: కలప కోత మిల్లుల్లో అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని జహీరాబాద్ ఆటవీ రేంజ్ అధికారి దేవివాల్ అన్నారు. సోమవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో నియోజకవర్గంలోని కలప కోత మిల్లుల యజమానులతో సమావేశమయ్యారు. కలప కోత మిల్లు యజమానులు తప్పనిసరిగ్గా రికార్డుల్లో కలప అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలన్నారు. చెట్లను నరికేందుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రేంజ్ అధికారి బాలకృష్ణరాజు, ఎఫ్‌ఎస్‌వో దుర్గయ్య, కృష్ణమ్మ పాల్గొన్నారు.


### ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు



మునిపల్లి, సెప్టెంబర్ 23: మండలంలోని మేళసంగం గ్రామ శివారులోని గోల్డెన్ గ్రీన్ వెంచర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని సోమవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి అధికారులు స్పంచారు. గ్రీన్ వెంచర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే చర్యలు

సిర్గాపూర్, సెప్టెంబర్ 23: ప్రజా ధనాన్ని దుర్వినియో గం చేస్తే చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీవో బాలరాజ్, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్ హెచ్చరించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఏడాది నుంచి జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. కూలీల వేతనాల చెల్లింపులు రూ.3.92 కోట్లు, మెటీరియల్‌కు రూ.7.45 లక్షలు, అన్ని గ్రామాలకు కలిపి రూ.1,34,818 రికవరీ తేలిందని అధికారులు తెలిపారు. క్వాలిటీ కంట్రోలర్ సుభాష్, ఏపీడీ రాజు, ఎస్‌ఆర్‌పీ నర్సయ్య, ఈసీ ఎక్బాల్, ఏపీవో బస్వరాజ్, తదితరులు ఉన్నారు.


చౌటకూర్: గణేశుడి నిమజ్జనంలో బీఆర్‌ఎస్ నాయకులు

## ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 23: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల నుంచి వరంగల్‌లో ప్రారంభం కానున్న అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును సోమవారం సంగారెడ్డిలో ఎంపిక చేశారు. జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ కొనసాగింది. ఎంపికకు జిల్లా వ్యాప్తంగా 105 మంది క్రీడాకారులు హాజరు కాగా, 16 మందిని ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఇందులో రాహుల్ నాయక్, హిశాంత్, రుత్విక్ రోళ్ల, దీక్షిత్, యోగేశ్వర్ సింగ్, విక్రమ్ రాథోడ్, అంజి, సిరిల్ డాల్సన్, మనిషత్విక్, గణేశ్, పాండు, నెవిన్ మానిత్, ప్రణీత్‌రెడ్డి, స్టాలిన్, అక్షయ్‌కుమార్, హరీశ్‌గౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

## గంజాయి దందా చేస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

బొల్లారం, సెప్టెంబర్ 23: గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఇద్దరు మహిళలను బొల్లారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ గంగాధర్ కథనం ప్రకారం.. మున్సిపాలిటీలోని వైఎస్సార్‌కాలనీ పూరి జగన్నాథ్ ఆలయ సమీపంలో నివసించే ఇద్దరు మహిళల ఇంట్లో సోమవారం రాత్రి పోలీసులు తనిఖీ చేయగా 9.8 కిలోల ఎండు గంజాయికి సంబంధించి ఐదు సంచులు పట్టుబడ్డాయి. నిందితురాళ్లిద్దరూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వీరు ఒడిశా రాష్ట్రానికి చెందిన వేరే మహిళల నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. క్లూస్ టీం సభ్యుడు చిట్టిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై దశరథ్, కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, ప్రవీణ, క్లూస్ టీం సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

### గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్, సెప్టెంబర్ 23: అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సంబంధిత అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి తెలంగాణలోని వస్తున్న ట్రావెల్స్, బస్సులు, కార్లలో తరలిస్తున్న ఖరీదైన 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న మద్యాన్ని పారబోశారు. సీఐలు చంద్రశేఖర్, మల్లికార్జున్, ఎస్ఐలు హనుమంతు, రమేశ్, ఇబ్రహీం ఉన్నారు.

### భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

సిర్గాపూర్, సెప్టెంబర్ 23: భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సిర్గాపూర్ మండలం కిషన్‌నాయక్‌తండాలో చోటు చేసుకుంది. సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. కిషన్‌నాయక్‌తండాకు చెందిన జనాబాయి(35) తన భర్త నాందేవ్ జాదవ్ మద్యానికి బానిసై, తరుచూ భార్యను అనుమానిస్తూ కొడుతూ వేధిస్తున్నాడు. ఎన్నిసార్లు వారించినా తన భర్త మారకపోవడంతో, ఆయన వేధింపులు తాళలేక తన చేనులోని వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి రాథోడ్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడి అదృశ్యం

సిర్గాపూర్, సెప్టెంబర్ 23: యువకుడు అదృశ్యమైన ఘటన సిర్గాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సోమవారం సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిర్గాపూర్‌కు చెందిన మచ్చూరీ శేఖర్(32) పక్షం రోజుల నుంచి మద్యం తాగుగు మానేశాడు. దీంతో ఆయన మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన సోదరుడు విఠల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 23: ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక సీపీఐ నాయకులు సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆర్టీఏ అవసరాల కోసం నారాయణఖేడ్ ప్రాంతవాసులు జహీరాబాద్, సంగారెడ్డికి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరంజీవి, అశోక్ పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితం

జహీరాబాద్, సెప్టెంబర్ 23: ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, డీపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక డిపోలో గిఫ్ట్ స్కీం పథకంలో భాగంగా డీలక్స్ బస్సులో ప్రయాణించిన మహిళా ప్రయాణికులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన ముగ్గురు మహిళలకు రూ.1,000 విలువైన గిఫ్టులను అందజేశారు.

